

నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయాలు

● ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

పార్వతీపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటి నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం తదితర నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు విక్రయించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మొత్తంగా ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. పార్వతీపురంలో నాలుగు, సాలూరులో రెండు, పాలకొండలో రెండు కౌంటర్ల ద్వారా కిలో కందిపప్పు రూ.160, సోనామసూరి బియ్యం కిలో రూ.49కు విక్రయించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జేసీ శోభిక కోరారు.

మలేరియా కలకలం

● జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
● రోగులతో ఆసుపత్రులన్నీ కిటకిట
● వర్షాలు పడితే బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం
● స్ప్రేయింగ్ జరుగుతున్నా.. పరిస్థితి అదుపులోకి రాని వైనం
● ఆందోళనలో 'మన్యం' వాసులు


జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు


(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

మన్యంలో మలేరియా విజృంభిస్తోంది.. రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి. పట్టణాలు, పల్లెల్లో చిన్నా, పెద్ద అని తేడా లేకుండా ఎంతోమంది మంచం పట్టారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులు సైతం మలేరియా, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. మరోవైపు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో పాటు జిల్లా కేంద్రాసుపత్రి కూడా జ్వర బాధితులతో కిటకిట లాడుతున్నాయి. 'మలే రియా నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం.. స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తున్నాం.. మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.. ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం' అని మరోవైపు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. అంతటా మలేరియా కేసులు అధికంగా నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.


మలేరియా కేసులపై సీతంపేట ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంవో (ఫైల్)

ఫాగింగ్ ఎక్కడ...

పారిశుధ్య పనుల నిర్వహణకు గత వైసీపీ ప్రభుత్వం సక్ర మంగా నిధులు కేటాయించ లేదు. దీంతో జిల్లా కేంద్రం పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలతో పాటు పలు గ్రామాల్లో దోమల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం ఫాగింగ్ కూడా చేపట్టని పరిస్థితి. అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడమే దీనికి మరో కారణంగా చెప్పవచ్చు. 2020 తర్వాత జిల్లాలో దోమతెరల పంపిణీ జరగలేదు. నాలుగు లక్షల దోమ తెరలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపినా.. గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు.



మలేరియా కేంద్రాలుగా...

వాతావరణ మార్పులతో పాటు గ్రామాల్లో పారిశుధ్య లోపం, కలుషిత నీరు, దోమల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయితే వర్షాలు పడితే .. సీజనల్ వ్యాధిగ్రస్థుల సంఖ్య మరింతగా పెరగనుంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని పీహెచ్‌సీల పరిధిలో ఉన్న గ్రామాలు మలేరియా కేంద్రాలుగా ఉన్నాయని చెప్పవచ్చు. సీతంపేట మండలం దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెద్దపొల్ల, సీతంపేట, దాసుగుమ్మడ తదితర గ్రామాలు మలేరియాకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలంలో దొడ్డుఖల్లు, రేగిడి, తాడికొండ, కొమరాడ మండలంలో మాదలంగి, కురుపాం మండలంలో నీలకంఠాపురం, పాచిపెంట మండలంలో జీఎన్‌పేట, సాలూరు మండలంలో తోణాం తదితర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న అనేక గ్రామాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదువుతున్నాయి. రోజురోజుకూ ఆయా గ్రామాల్లో మలేరియా, వైరల్ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. అత్యధికులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు గ్రామాల్లో ఉంటూ.. సంచి వైద్యులతో సేవలు పొందుతున్నారు. మరోవైపు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు కూడా జ్వరాలతో బాధపడుతన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించి.. మలేరియాను అదుపులోకి తేవాల్సి ఉంది.


సాలూరు ఆసుపత్రిలో..

కేసుల నమోదు ఇలా..

జిల్లాలోని 401 గ్రామాల్లో స్ప్రేయింగ్ చేస్తున్నారు. అయినప్పటికీ మలేరియా కేసులు తగ్గడం లేదు. రోజురోజుకూ బాధితులు పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. 2022లో 52 కేసులు నమోదు కాగా 2023లో 442 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటివరకు 482 కేసులు నమోదయ్యాయి. కాగా డిసెంబరు నాటికి ఈ కేసుల సంఖ్య ఎంతకు చేరుతుందో అనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. రానున్న రోజుల్లో గట్టిగా వర్షాలు కురిస్తే.. మరిన్ని కేసులు పెరిగే అవకాశం ఉంది. మలేరియా, సీజనల్ జ్వరాలతో ఆసుపత్రులన్నీ మరింత రద్దీగా మారనున్నాయి. అయితే ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగుల సంఖ్యను మాత్రమే అధికార యంత్రాంగం వెల్లడిస్తుంది. జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్ని మలేరియా కేసులు నమోదవుతున్నాయది తెలియడం లేదు. వాటిపై కూడా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. 'మన్యం'లో మలేరియా మరణాలు సంభవించకూడదని ఇటీవల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కూడా ఆదేశించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి.. మలేరియాను నియంత్రించాల్సి ఉంది.

నివారణకు చర్యలు

జిల్లాలో మలేరియా నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నప్పటికీ.. ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మొత్తంగా 401 గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపడుతున్నాం.

- జగన్మోహన్‌రావు, జిల్లా మలేరియా అధికారి, పార్వతీపురం మన్యం

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

● హెల్త్‌కార్డుల జారీకి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వారి కోసం సమగ్ర ఆరోగ్య కార్డులు (ఇంటిగ్రేటెడ్ హెల్త్ కార్డులు) సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మన్యం'లో గిరిజనుల జీవనోపాధికి అవసరమైన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. అటవీ ఉత్పత్తులతో వివిధ వస్తువులను తయారు చేయాలని సూచించారు. అనాసపనస ప్రాసెస్ యూనిట్ల స్థాపనకు అధికారులు కృషిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు కావాలని తెలిపారు. మెనూలో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, డీఈవో పగడాలమ్మ, గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న మూడు నెలలు కీలకం

వైద్య ఆరోగ్యశాఖ రానున్న మూడు నెలలు కీలకంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. జ్వరాలు, సీజనల్ వ్యాదులు ప్రబల కుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రిఫరల్ చేయకుండా స్థానికంగానే వైద్యం అందించాలని సూచించారు. ఆశాలు గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. ఆసుపత్రుల వారీగా మలేరియా కేసులు, వారు వాడుతున్న మందుల తీరుపై నివేదిక అందించాలని ఆదేశించారు.


పాలకొండ మండలం ఎం.సింగుపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

డీఎంవో టి.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుప త్రుల సమన్వయక అధికారి బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, డీఐవో నారాయణరావు, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలకొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎం.సింగుపురంలో పీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో రేబీస్, పాముకాటు వ్యాక్సిన్లతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలపై దృష్టి సారించాలని, విషజ్వరాలు, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులను నివారిం చొచ్చన్నారు. అంతకముందు గ్రామంలో చేపడుతున్న శానిటేషన్ పనులపై పంచాయతీ కార్యదర్శి సింహాచలాన్ని అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జడ్పీ ఉన్నతపాఠశాలలో తరగతి గదులు, పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి.. జవాబులు రాబట్టారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో రామకృష్ణారావు, తహసీల్దార్ వరహాలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విజయనగరం జిల్లాకు

నేడు సీఎం రాక

● భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించనున్న చంద్రబాబు
● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విజయనగరం కలెక్టరేట్, జూలై 10: ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబునాయుడు గురువారం తొలిసారిగా విజయనగరం జిల్లాకు రానున్నారు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రాంతంలో రన్‌వేపై ఏర్పాటు చేస్తున్న హెలీపాడ్ స్థలాన్ని కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ దీపికాపాటిల్ బుధ వారం పరిశీలించారు. భద్రతపై అధికారులతో చర్చించారు. ఫొటో ఎగ్జిబిషన్, వీఐపీ లాంజ్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సమన్వయంతో పని చేయాలని, ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు.

సీఎం పర్యటన ఇలా ...

ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 11.20 నుంచి 11-50 గంటల వరకూ అనకాపల్లి జిల్లా దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 12.35 గంటలకు భోగాపురం చేరుకుంటారు. 1.30 గంటల వరకూ ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శిస్తారు. పనుల తీరుపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం విశాఖకు వెళ్లనున్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించనున్న ఎయిర్‌పోర్టు ప్రాంతం



వరాహావతారంలో జగన్నాథుడు

రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గుడించా మందిరంలో జగన్నాథుడు బుధవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. తొలుత స్వామివారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. సాలూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు జగన్నాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండలోనూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

- సాలూరు

ప్రతిపాదనలకు ఐదేళ్లు

● పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి నిర్మాణంపై పట్టని గత వైసీపీ సర్కారు
● నిర్వహణనూ గాలికొదిలేసిన వైనం ● భారీ గోతులతో నిండిన మార్గం
● వాహనదారుల రాకపోకలకు అవస్థలు
● మరమ్మతులకూ నిధులు లేని వైనం ● నూతన ప్రభుత్వంపైనే ఆశలు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ ప్రధాన రహదారి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. సుమారు రూ. 5కోట్లతో రోడ్డు పనులకు ప్రతిపాదనలు పంపినా గత వైసీపీ సర్కారు స్పందించలేదు. గత ఐదేళ్లూ దాని నిర్వహణను సైతం గాలికొదిలేసింది. దీంతో ఈ రోడ్డు భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా గరగుబిల్లి మండలం ఉల్లిభద్ర సమీపంలో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడున్న ప్రధాన కల్వర్టుకు సైతం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు మేలుకోవాల్సి ఉంది.


ఉల్లిభద్ర సమీపంలో రహదారి ఇలా..

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం నుంచి సంతోషపురం వరకు రహదారి నిర్మాణం కోసం సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేశారు. అప్పట్లో రూ. 5 కోట్లకు ప్రతిపాదనలు చేస్తే మరమ్మతులకు రూ. 5 లక్షలు మాత్రమే మంజూరు చేశారు. ఇందులో జీఎస్టీ, తదితర వాటి రూపంలో కొంత మొత్తం కోత పడడంతో రూ. 2 లక్షలకు పైగా నిధులతోనే గోతులు పూడ్చివేసి మమ అనిపించారు. దీంతో ప్రస్తుతం రోడ్డు మళ్లీ యథాస్థితికి చేరుకుంది. ఉల్లిభద్ర తోటపల్లి కుడి ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న రహదారి మార్గం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో రోడ్డు ఎక్కడుందో వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలయ్యారు. నాలుగు చక్రాల వాహనాల బంపర్లు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. కాగా ఈ మార్గంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రధాన కల్వర్టుకు కూడా ప్రమాదం పొంచి ఉంది. తోటపల్లి కుడి ప్రధాన కాలువకు ఆనుకుని గట్టు ప్రాంతంలోనూ భారీగా గోతులు ఏర్పడ్డాయి. తాత్కాలిక మరమ్మలకు కూడా నిధులు లేకపోవడంతో ఆర్‌అండ్‌బీ శాఖ నూతన ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. కాగా త్వరితగతిన ఈ రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ పి.ప్రమీలను వివరణ కోరగా.. నిధుల కొరతతో రోడ్డు నిర్మాణం, మరమ్మతులు చేపట్టలేకపోతున్నామన్నారు. నవిరి నుంచి సంతోషపురం వరకు రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నూతన ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిం చామని , ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా గోతులను పూడ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందే..

● ప్రజా సంఘాల డిమాండ్

పార్వతీపురం టౌన్, జూలై 10 : కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని నినదించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అధికారులు కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వెలుగు, మెప్మా, ఉపాధి తదితర పథ కాల్లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ నిరసనలో వివిధ స్కీమ్ వర్కర్‌ల సంఘ సభ్యులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో
బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్

దిక్సూచి DIKSUCHI



పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్న గూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఎ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపి, పులివెందుల) క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎన్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్ బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉం డాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్‌లు

పుణెలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ)-పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 24 సీట్లు ఉన్నాయి.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సుకు బీఎస్సీ(జనరల్/అగ్రికల్చర్/ఫిషరీస్/నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ)/బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్సీ(బ్లెండెడ్)పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(వైన్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కెమిస్ట్రీ/అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/హార్టికల్చర్); పీజీడీఐఎఫ్ఏటీ/బీటెక్(కెమికల్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.

పీజీ డిప్లొమా

- **షుగర్ టెక్నాలజీ(ఎస్‌టీ):** ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ప్రవేశానికి బీఎస్సీ(సుగర్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్/ఎంపీసీ)/బీటెక్(కెమికల్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 50 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- **ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ(ఐఎఫ్ఏటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 22 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ, వైన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆల్కహాల్ టెక్నాలజీ సబ్జెక్టులలో ఒకటి ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.



- **షుగర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎస్ఐటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులు; బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ ఇంజనీరింగ్ డిప్లొమా(ఎస్ఈడీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఇందులో ప్రవేశానికి బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్(ఎస్ఈసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. షుగర్‌మిల్లులో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. ఇందులో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్(ఎస్ఎంసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీఎస్సీ(కెమిస్ట్రీ/సుగర్ టెక్నాలజీ)/డిప్లొమా(సుగర్ టెక్నాలజీ/సుగర్ మాన్యుఫాక్చర్/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఇందులో 35 సీట్లు ఉన్నాయి.

సర్టిఫికెట్

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్(ఎస్‌బీసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- **జ్యూస్ సూపర్విజన్ సర్టిఫికెట్(జేఎస్‌సీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **ఈటీపీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్టిఫికెట్(ఈటీపీఓఎం):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** ఎమ్మెస్సీ కోర్సులకు జూలై 23న; పీజీ డిప్లొమా(ఐఎఫ్ఏటీ)కి జూలై 24న
- **ఇంటర్వ్యూలు:** జూలై 23 - 25
- **వెబ్‌సైట్:** www.vsisugar.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jVHfrSTలో చదవండి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్.

తిన్నడి విల్లు కథ




మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద 'టీజర్ అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయారు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

● పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు ● నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది
విష్వక్ సేన్



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్‌'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

ప్రేక్షకులను రప్పించడం ముఖ్యం



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు

తిరుమల (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది" అని అన్నారు.

షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?



బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mITke5z లో చదవండి.

పైడితల్లి ఆలయ హుండీ లెక్కింపు



విజయనగరం రూరల్: పైడితల్లమ్మవారి దేవస్థానం చదురుగుడి 9 హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. 37 రోజులకు గాను, నగదు రూపంలో రూ.13,43,881, బంగారు రూపంలో 18.6 మిల్లీగ్రాములు, వెండి రూపంలో 486 గ్రాములు వచ్చినట్లు ఈవో ప్రసాదరావు తెలిపారు. అమ్మవారి సేవాసమితి, శ్రీవారి సేవ, కెనరా బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో జిల్లా ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు

బొబ్బిలి: ఈ నెల 13, 14 తేదీలలో బొబ్బిలి లోకబంధు రెసిడెన్సీలో జిల్లా ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం బొబ్బిలిలో రాష్ట్రఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను గుర్తించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, ఇతర అంశాలను చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణికుమార్ పాల్గొన్నారు.

ఆగస్టు 10 నుంచి సాఫ్ట్‌బాల్ స్టేట్ మీట్

బొబ్బిలి: వచ్చే నెల 10, 11, 12 తేదీల్లో పుత్తూరులో ఏపీ సీనియర్ సాఫ్ట్‌బాల్ స్టేట్ మీట్ జరుగుతుందని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఇనుగంటి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ మీట్‌లో పాల్గొనే ఆసక్తి కలిగిన క్రీడాకారుల కోసం జిల్లా స్థాయిలో సీనియర్ మెన్ అండ్ విమెన్ సెలక్షన్స్ ఈ నెల 13న బొబ్బిలి మండలం పారాది జిల్లా పరిషత్ హైస్కూలు మైదానంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన సీనియర్ క్రీడాకారులంతా తమ గుర్తింపు కార్డులతో శనివారం ఉదయం 9 గంటలకు పారాది హైస్కూలుకు రావాలని కోరారు.

బధిరుల సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి: మూగ, చెవిటి దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేశ్‌బాబు, జి.గణపతి స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు బుధవారం బొబ్బిలిలో వినతిపత్రం అందజేశారు. రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని, పెన్షన్ మంజూరులో నిబంధనలను సడలించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, వినికిడి లోపం ఉన్న వారికి 4జీ మొబైల్స్ ఇవ్వాలని, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని, ప్రత్యేక స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని, ఇళ్ల మంజూరు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, తమ రిజర్వేషన్ అమలులో పారదర్శకత పాటించాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని బేబీనాయన వారికి హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులను చేపడుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆవాల అనంతరావు తెలిపారు. కలవరాయి, బలిజిపేట, ఆరోరా, సహారా ఫీడరులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ కారణంగా బలిజిపేట, పినపెంకి, వంతరాం, జగన్నాథపురం, కలవరాయి, పెంట, పిరిడి, సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

రాజాం: యోగ సాధన ద్వారానే శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పొందవచ్చని వికాస తరంగిణి కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి రమణమూర్తి అన్నారు. వికాస తరంగిణి రాజాం ఆధ్వర్యంలో గత పది రోజులుగా ఉదయం తెలగవీధిలో విద్యానికేతన్ పాఠశాలలోను . సాయంత్రం వికాసతరంగిణి కార్యాలయంలో నిర్వహించబడుతున్న యోగ శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన విద్యానికేతన్ పాఠశాల అధినేత గట్టి పాపారావు మాట్లాడుతూ యోగాభ్యాసం నిత్యజీవితంలో ఒక భాగం కావాలని దీనివలన సమస్యలను ఎదుర్కొనే తత్వం అలవడుతుందని పేర్కొన్నారు. ఈ యోగ తరగతులలో సమారు 80 మంది వరకు శిక్షణ పొందినట్లు నిర్వాహ కులు వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, మురపాక గణేష్ ముప్పన మన్మథరావు తెలిపారు.

మామిడి తోటలను పెంచండి

రాజాం, జూలై 10: ప్రతి గ్రామంలో మామిడి తోటలు పెంచాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించా రు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన పారమ్‌పాండ్ తవ్వకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రైతుల పంటపొలాల్లో తవ్వకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ లావేటి శ్రీనివాస రావు, ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు

వర్మీ కంపోస్టు పంపిణీ

జామి: జట్టేడివలస పంచాయతీలో చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి కుమారి ఆధ్వర్యంలో విజ యవంతంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ తడి, పొడి చెత్తనుంచి తయారైన వర్మీ కంపోస్టును బుధవారం రైతులకు ఉచితంగా అందించారు.

లక్ష్మీపురంలో గ్రామసభ

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ, ఎంపీటీసీ పాలవలస గౌరు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని తెలిపారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి యోగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన

విజయనగరం/రూరల్: నగరంలోని బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం, ఆరోగ్య తనిఖీలు నిర్వహించుకుని ఆరోగ్యవంతమై బిడ్డలకు జన్మనిచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా మెలగాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతను పాటిస్తూ చిన్నారులతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూలై 10: ఉత్తరాంధ్ర అభివద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం ఎమ్మెల్యే అదితి, నెల్లిమర్ల నియోజవర్గం టీడీపీ ఇంచార్జి కర్రోతు బంగార్రాజుతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడిందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి వైసీపీని ఇంటికి పంపించారన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు పనులు పరిశీలించేందుకు చంద్రబాబు జిల్లాకు విచేస్తున్నారని, పర్యటనలో భాగంగా జిల్లాలోని పెండింగ్ ప్రాజక్టులు, అభివృద్ధిపై ఆయన సమీక్షిస్తారన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రజలు టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని నాగార్జున పిలుపునిచ్చారు.

విజయనగరం ఎమ్మెల్యే అదితీ గజపతిరాజు మాట్లాడుతూ అభివృద్ధిని పట్టాలెక్కించేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎయిర్‌పోర్టుకు, నగరానికి నీరు అందించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తి అయితే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీపీ రాజు, టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడు, అల్లి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున, ఎమ్మెల్యే అదితి, కర్రోతు బంగార్రాజు

ప్రజాభీష్టం మేరకే టోల్‌గేట్: కలెక్టర్

కలెక్టరేట్, జూలై 10: ఎన్‌హెచ్ 26 జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ పై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతున్న దృష్ట్యా ప్రజాభీష్టం మేరకే టోల్‌గేట్ ఉండాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. బుధవారం ఆయన చాంబర్‌లో స్థానిక శాసనసభ్యులు అతిథి విజయలక్ష్మి గజపతి రాజుతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జొన్నాడ టోల్‌గేట్ ఏర్పాటు చేయడంలో జరిగిన అగ్రిమెంట్ కాపీలను గజిట్ కాపీలను కలెక్టర్ పరిశీలించారు. నిబంధ నలను అనుసరించి చేశారా లేదా? జొన్నాడ వద్ద ఎందుకు టోల్‌గేట్ ఏర్పాటు చేయవలసి వచ్చిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారుల వీడీ ప్రభాత్ రంజన్ మాట్లాడుతూ వివరాలన్నింటినీ సమర్పించడానికి రెండు రోజుల గడువు కోరారు. తర్వాత మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఆర్‌డీవో సూర్యకళ, జాతీయ రహదారుల ఈఈ శ్రీనివాసులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

వైసీపీ చర్యలతో టిడ్కో ఇళ్లకు గ్రహణం: బేబీనాయన



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జూలై 10: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానసపుత్రిక టిడ్కో సముదాయాలని, వాటితో చంద్రబాబుకు మంచి పేరు ప్రఖ్యాతులు దక్కుతాయనే దుర్బుద్ధితో వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్లకు గ్రహణం పట్టించిందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగరావు (బేబీనాయన) ఆరోపించారు. స్థానిక రామన్నదొరవలస సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల సముదాయాలను ఆయన బుధవారం సందర్శించారు. నిర్మాణంలో ఇళ్లను పరిశీలించి, వాటి తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో టిడ్కో ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పేదలు కూడా బహుళ అంతస్తు భవనాల్లో ఉండాలన్న ఆశయం మేరకు జి ప్లస్ 5 ప్రాతిపదికన టిడ్కో ఇళ్ల కాలనీల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. అయితే ఈ ప్రాజెక్టు పనులకు వైసీపీ మోకాలడ్డిందన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో ఈ పను లు జోరందుకుంటాయన్నారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, సీనియర్ నేతలు పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక కోసం కాల్ చేయవద్దు

బొబ్బిలి నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి సిఫారసుల కోసం తనకు ఎవరూ ఫోన్‌కాల్ చేయవద్దని, అలాంటివాటిని ఎంతమాత్రం సహించేది లేదని ఎమ్మెల్యే బేబీనాయన స్పష్టంచేశారు. స్థానిక గ్రోత్‌సెంటరులోని ఇసుక డిపోను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేదబడుగువర్గాలకు ప్రయోజనకరంగా ఉండాలన్న ఉద్దేశంలో ఉచిత ఇసుక విధానాన్ని సీఎం చంద్రబాబు తెచ్చారని, ఇచ్చిన మాట నిలబెట్టుకొని అమలుకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదన్నారు. అక్రమ ఇసుక దందాల కోసం తనకు రికమండేషన్‌లు చేయవద్దన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అధికార యంత్రాంగం నిర్భయంగా, నిజాయితీగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దారు త్రినాధరావు నాయుడు, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆగస్టు 14 వరకూ శాచ్యురేషన్ డ్రైవ్: జేసీ



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్, జూలై 10: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల మొదటి నుంచి అగస్టు 14 వరకూ ఎఫ్‌పీవోల శాచ్యురేషన్ డ్రైవ్ నిర్వహిస్తామని జేసీ కార్తీక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీవోల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల పురోగతికి ఎఫ్‌పీవోలు సహకరించాలని తెలిపారు. ఎఫ్‌పివోలో సభ్యత్వం పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆగస్టు నాటికి 500 సభ్యత్వాన్ని సాధించాలని ప్రత్యేకించి చిన్నసన్నకారు రైతులను ఎఫ్‌పివోలలో సభ్యులుగా చేర్పించాలని తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

- డీఈవో ప్రేమకుమార్

భోగాపురం, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. పోలిపల్లి జిల్లాపరిషత్ ఉన్నపాఠశాల, భోగాపురం కస్తూర్బా బాలికల పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. పరిశుభ్రత, ఎండీఎం నిర్వహణ, విద్యార్థుల స్కూల్ కిట్ల పంపిణీ, అడ్మిషన్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం మాట్లాడుతూ గతం కన్నా విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన ఉండాలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమణమూర్తి, ఎంఈవో-2 బాలిపల్లి చంద్రమౌళి, ఎంఐఎస్ దుక్కా సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న డీఈవో ప్రేమకుమార్

నిర్మాణంలో ఉన్న భవనంలో కళాశాల తరగతులా ?

బొబ్బిలి, జూలై 10: బొబ్బిలి పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనంలో ఓ కార్పొరేట్ కళాశాల తరగతులను నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం కళాశాలకు వెళ్లి విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటకు పంపించివేశారు. దీనిపై గత కొద్ది రోజుల నుంచి ఆందోళనలు చేపడుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాక కళాశాల యాజమాన్యం చాలా బాధ్యతా రహితంగా తరగతులను కొనసాగిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకుడు రామ్మోహన్ అన్నారు. ఈ విషయమై ఆర్ఐవోకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన స్పందించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే



కోండ్రు చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న రైతులు

రాజాం, జూలై 10: సోపేరు గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రైతులకు బుధవారం ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. వంగర మండలంలో పలు సమస్యలపై మాజీ జడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవరావునాయుడు అందజేసిన వినతిపైనా స్పందించారు. మడ్డువలస మెయిన్ కెనాల్ నుంచి సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా కాలువలను బాగుచేయాలని అధికారులను ఆదేశించినట్లు కోండ్రు తెలిపారు. మడ్డువలస కాలువలకు మరమ్మతులతో పాటు డ్యామ్ గేటు లీకేజీ విషయంలోనూ చర్యలు తీసుకుంటామని కోండ్రు హామీ ఇచ్చారు.

- ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ 7 గంటల విద్యుత్ సరఫరాను తొమ్మిది గంటలకు పెంచడంపై సోపేరు గ్రామ రైతులు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ కోండ్రు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ప్రభుత్వ బడుల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

బాడంగి: ప్రభుత్వ బడుల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం దత్తి సత్యనారాయణ తెలిపారు. బుధవారం దివ్యాంగ విద్యార్థిని పాఠశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు విద్యతోపాటు ప్రభుత్వం అనేక రకాల రాయితీలు, అలవెన్సులు ఇస్తూ పదో తరగతిలో 10 మార్కులకే పాస్ సౌకర్యం కల్పిస్తుంద న్నారు. 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు మా పా ఠశాలలో ప్రవేశం కల్పిస్తామని, వీరితోపాటు సాధారణ విద్యార్థులకు నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని తెలిపారు.

వాహన తనిఖీలు

శృంగవరపుకోట రూరల్: పోతనాపల్లి జంక్షన్ వద్ద విజయనగరం ఆర్‌టీవో కార్యాలయం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, ఎస్.కోట ఆర్‌టీసీ డిపో మేనేజర్ రమేష్‌లు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేని వాహనాలు, వివిధ ధ్రువపత్రాలు లేకుండా నడుపుతున్న 90వాహనాల నుంచి రూ.21వేల జరిమానాతో పాటు నాలుగు వాహనాలు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.



పోతనాపల్లిజంక్షన్ వద్ద వాహన తనిఖీలు

కొత్త బీఎన్ఎస్ చట్టం డ్రైవర్లకు ఉరితాడే



కలెక్టరేట్: విజయనగరం కలెక్టరేట్ వద్ద డ్రైవర్ల నిరసన



కొత్తవలస: తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

కలెక్టరేట్, జూలై 10: కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్టం మోటార్‌వాహనాల డ్రైవర్లకు ఉరి తాడులాంటిదని, ఫీజులు, పెనాల్టీలు పెంచుతూ తెచ్చిన జీవో నెంబరు 21ను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఆయా నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కోవిడ్‌తో రవాణా రంగం సంక్షోభంలో పడిందని, బాడుగలు లేక కిస్తీలు కట్టలేక సొంత వాహనాలను అమ్ముకోవల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ ప్రమాదకరమైన క్రిమినల్ చట్టాలను పార్లమెంట్‌లో చర్చ పెట్టకుండానే ఏకపక్షంగా అమలుకు ప్రయత్నించిందన్నారు. జొన్నాడ వద్ద టోల్ గేట్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

కొత్తవలస: కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టం మోటార్‌వాహనాల డ్రైవర్లకు ఉరి తాడులాంటిదని సీఐటీయూ కార్యదర్శి కె.సురేష్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ, మోటార్‌కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ గత పదేళ్ల కాలంలో దేశాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కొత్త చట్టంలోని సెక్షన్‌లతో యాక్సిడెంట్‌లకు సంబంధించి డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తే డ్రైవర్లందరూ జైళ్లలోనే మగ్గాల్సి ఉంటుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపారని, అసంఘటిత రోడ్డు రవాణా కార్మికుల కోసం సామాజిక భద్రతా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పని చేస్తున్న కార్మికులతో సంబంధం లేకుండా అన్ని కార్మిక చట్టాలు రోడ్డు రవాణా కార్మికులందరికీ వర్తింప చేయాలన్నారు.

విద్యుదాఘాతంతో హోంగార్డు మృతి



వెంకటసత్యం (ఫైల్)

వేపాడ, జూలై 10: విద్యుత్ షాక్‌తో హోంగార్డు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన గిడుతూరి వెంకటసత్యం(48) కొత్తవలస పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా ఉంటూ దిశా వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బొద్దాంలోని ఇంటి వద్ద బుధవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. మృతుడికి భార్య పార్వతి, బాబు, పాప ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఎస్.కోట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, హెడ్ క్వార్టర్ నుంచి ఏఆర్ ఎస్సై తదితరులు వచ్చి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను, సంక్షేమాన్ని బాధిత కుటుంబానికి అందజేసి ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.కోట రూరల్ సీఐ ఉపేంద్ర, వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మరో హోంగార్డు..



శ్రీనివాసరావు (ఫైల్)

రేగిడి, జూలై 10: ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ హోంగార్డు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం లచ్చరాయపురం గ్రామానికి చెందిన కాత్రకాన శ్రీనివాసరావు(47) ఉంగరాడమెట్ట యాత కాలనీలో భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈయన రాజాం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా గత మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో ఈయన అప్పుల పాలవ్వటం, ఫైనాన్స్ వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకోవటంతో ఈయనపై తీవ్ర ఒత్తిడి పెరిగినట్లు సమాచారం. దీంతో ఈ నెల 7న భార్య, పిల్లలు ఇంట్లో లేని సమ యంలో గడ్డిమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురి కాగా స్థానికులు గుర్తించి రాజాం ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించగా కుటుంబీకులు శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి రాగోలు జెమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవా రం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య ఉదయ్‌కుమారి, పిల్లలు ప్రేమ్‌కు మార్, ప్రసన్నలత ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం జరగ్గా, కొడుకు ఇంజినీ రింగ్ చదువుతున్నాడు. మృతదేహానికి స్థానిక పోలీసులు శవపంచనామ, పోస్టుమా ర్టం పూర్తిచేశారు. దీంతో స్వగ్రామం లచ్చరాయపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస, జూలై 10: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ సూర్యప్రకాష్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడివానిపాలెం గ్రామానికి చెందిన ముదపాక సన్యాశిరావు(43) కూలి పనులుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికై బానిసయ్యాడు. దీంతో భార్యతో కాకుండా వేరుగా నివాసం ఉంటున్నాడు. వీరికి పిల్లలు లేరు. అయితే మంగళవారం సాయంత్రం తన ఇంటిముందు నురగలు కక్కుతూ పడి ఉండగా స్థానికులు గుర్తించి భార్య ఆదిలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె వెంటనే 108లో చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. విషం తాగడం వల్లనే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని మృతుని భార్య ఆదిలక్ష్మి తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశామని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కుమార్తె ఆచూకీ కోసం తల్లి ఫిర్యాదు

కొత్తవలస, జూలై 10: కుమార్తె కనిపించడం లేదంటూ విశాఖపట్టణం జిల్లా, పద్మనాభం మండలం కొత్తకొవ్వాడ గ్రామానికి చెందిన బంగారు పైడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రెహమాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తనకుమార్తె విజయలక్ష్మికి భర్త చనిపోవడంతో తనవద్దనే ఉంటూ కొత్తవలసలోని జ్యూస్ షాపులో పని చేస్తోందని, ఈ నెల 3న పనికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం దక్కలేదని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

జనసేన నాయకుడి కారు అద్దాలు ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు నాని

నెల్లిమర్ల, జూలై 10: నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని తన ఇంటి వద్ద ఉంచిన తన కారు అద్దాలను గుర్తు తెలియని వ్యకులు మంగళవారం అర్ధరాత్రి రాళ్లతో ధ్వంసం చేశారని నెల్లిమర్లకు చెందిన జనసేన నాయకుడు రవ్వా నాగేంద్ర వర్మ (నాని) నెల్లిమర్ల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన కారు అద్దాలను ఉద్దేశపూర్వకంగా గుర్తు తెలియని వ్యక్తులు బద్దలు కొట్టారని, నిందితులను తక్షణమే గుర్తించి వారికి చట్టపరంగా కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. జనసేనలో నాయకుడిగా తనకు గుర్తింపు లభిస్తుందన్న అక్కసుతోనే తన వాహనాన్ని అర్ధరాత్రి పూట పాడుచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పహారా వేయాలన్నారు.



కారు అద్దాలు పగిలి ఉన్న దృశ్యం

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

బొబ్బిలి, జూలై 10: బొబ్బిలి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గండిపల్లి అప్పలస్వామి (65)కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక కుమార్‌లాడ్జిలో క్లీనర్‌గా పనిచేస్తున్న అప్పలస్వామి తారకరామాకాలనీలోని తన ఇంటి నుంచి లాడ్జికి సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పార్వతీపురం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు బొబ్బిలి వైపు వస్తుండగా వెనుక నుంచి అప్పలస్వామిని ఢీకొనడంతో అతడి తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించి, అక్కడి నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవరుపై కొత్త రవాణా చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

కళాను కలిసిన 104 సిబ్బంది

రాజాం: ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును 104 సిబ్బంది మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు.

విద్యార్థులకు కిట్లు


జామి, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడు కావడమే ధ్యేయంగా విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు అన్నారు. బుధవారం మండలం లోని మోఖాసా కొత్తవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కిట్స్‌ను అందించారు. ఉపాధ్యాయులు జేవీ అప్పారావు పాల్గొన్నారు. ● **వేపాడ:** ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలలోనూ బుధవారం స్టూడెంట్స్ కిట్స్‌ను వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులు వినియోగించుకో వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చిరంజీవి, సర్పంచ్ సుంకరి రమణమ్మ తదిత రులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు సకాలంలో అందించాలి

రాజాం: ప్రజలకు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను సకాలంలో అందించాలని తహసీల్దార్ ఎస్.కృష్ణరాజు, ఎంపిడివో వి.శ్రీనివాసరావులు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు వచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరినప్పుడు వాటిని పరిశీలించి అవకాశం ఉన్నంతవరకు సకాలంలో పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసకురావాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలన్నారు. దీంట్లో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ పాఠశాలల సమస్యలపై అధ్యయనం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గల పలు మున్సిపల్ పాఠశాలల్లో గల సమస్యలపై అధ్యయనం చేసేందుకు యూటీఎఫ్ నాయకులు బుధవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూటీఎఫ్ కార్యవర్గసభ్యురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ కొరత తీవ్రంగా ఉందన్నారు. మున్సిపల్ విద్యారంగ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆమె తెలిపారు.



లక్కవరపుకోట: డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదినం



పార్వతీపురంలో విజయచంద్ర జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జన్మదిన వేడుకలను బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బొబ్బిలి, కురుపాం ఎమ్మెల్యేలు బేబీ నాయన, తోయక జగదీశ్వరి, నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విజయనగరం జిల్లా రాజాం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే విజయచంద్ర ప్రారంభించారు.రక్తదాతలులకు ఎమ్మెల్యే అభినందలుతెలిపి, ధ్రువీకరణ పత్రాలను పంపిణీచేశారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు బి.సీతారామ్, జి.వెంకటనా యుడు, ఎం.వెంకటేష్, బి.చంద్రమౌళి, జి.వెంకటరమణ, జి.రవికుమార్, కౌన్సిలర్ నారాయణరావు, నాయకులు ఎస్.భాస్కరరావు, కె.ప్రభాకరరావు, జె.రవిశంకర్, సీతానగరం మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు, పి.సత్యం, ఆర్.వేణు, నాయకులు డి.వెంకట భాను ప్రసాద్, వైద్యులు యాళ్ల వివేక్, సందీప్, వాసుదేవరావు, శ్రీలేఖ, వ్యాపార వేత్త ఐ.గోపాలరావు, సురేష్ స్కూల్ కరస్పాండెంట్ జి.ప్రసాదరావు,ఆర్కే జూనియర్‌కళాశాల కరస్పాండెంట్ పి.రామకృష్ణ, బలిజిపేట మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పి. వేణునాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కన్వీనర్ ఎస్.సంజీవి, జనసేన నాయకులు చందక అనీల్, ఎన్జీవో సంఘ నాయకులు జీవీఆర్ఎస్ కిషోర్ పాల్గొన్నారు.

వెంకంపేటలో రహదారి మరమ్మతులు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలో గల టీడీపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదినం పురస్కరించుకొని తమ సొంత నిధులతో రహదారిని మరమ్మతులుచేశారు. ఈపనులను ఎమ్మెల్యే విజయచంద్ర ప్రారంభించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు జాగాన రవిశంకర్, జాగాన ధనుం జయలను అభినందించారు.సుమారు రూ.20 వేలతో రహదారి మరమ్మతులకు ఖర్చు చేసామని, రవిశంకర్, ధనుంజయ, శివలు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాగాన మధుసూధనరావు, బార్నాల సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

● **సీతానగరం:** సీతానగరం చాకలివీధిలో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదిన పురస్కరించుకుని ఎల్వీఆర్ స్వచ్ఛంద సంస్థ ,పెదబోగిల ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్, మానస సేవా సంస్థ ప్రతినిధి బాలు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పా టుచేశారు. ఈ సందర్భంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. కార్యక్రమంలో వైద్యులు సాయితేజ, అప్పలకొండ సింహాచలం, టీడీపీ నాయకులు సాల హరిగోపాల్, దామినేని వెంకట భాను ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకు కృషి: ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: ఆర్టీసీ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలను అందించేలా కృషి చేస్తామని పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం పార్వతీపురం డిపో నుంచి విజయవాడ, విశాఖపట్నాలకు వెళ్లేందుకు సూపర్ లగ్జరీ, పల్లె వెలుగు బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలకు వెళ్లేందుకు గత ప్రభుత్వం హయాంలో బస్సులు తక్కువగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడం పలుసార్లు పత్రికల్లో రావడం చూసానని తెలిపారు. ప్రజలు కష్టాలు తెలిసిన ప్రభుత్వం కావడంతో రాష్ట్ర పగ్గాలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే నూతన బస్సుల సర్వీసులను అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ కనకదుర్గా, టీడీపీ నాయకులు, బి.సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

జోగులడుమ్మ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: జోగులడుమ్మ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులు, ఫిర్యాదుదారుల సమక్షంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎంపీడీవో పి.శ్రీనివాసరావ విచారణ చేపట్టారు.ఉపాధి హామీలో జరుగుతున్న అక్రమాలపై క్షేత్రసహాయకురాలు బూరి నాగమణిపై గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకులు కె.రామారావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి హామీ పథక ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు విచారణ చేపట్టాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావును ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు బుధవారం విచారణ చేపట్టారు. నివేదికను పీడీకి పంపిస్తానని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ సహాయకులు ఎంపీహెచ్ సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పి.మధు పాల్గొన్నారు.

ప్రకృతి విధానాలతో అధిక లాభాలు

● ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాలతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. బుధవారం మండలంలోని నందివాని వలసలో సాగుచేస్తున్న నవధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండ లాల్లోని గ్రామాల్లో గ్రేడ్-ఎ పంటల నమూనాలను వేయనున్నట్లు తెలిపారు. ఒకే ప్రాంతంలో ఒకే రకమైన పది ఎకరాలకు మించి పంటలు వేసుకుంటే పీజీఎస్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. పరిశీలనలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, అప్పలనాయుడు, రైతులు ప్రదీప్, అప్పలనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథయాత్ర ఉత్సవాలు

● కూర్మావతారంలో జగన్నాథుడి దర్శనం



పాలకొండ:కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

జిల్లాలో భక్తిశ్రద్ధలతో రథయాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం జగన్నాథుడ్ని కూర్మావతారంలో జగన్నాథుడ్ని అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుండా ఆలయాల అధికారులు ఏర్పాట్లుచేశారు. ఈ సందర్భంగా పరిసరాల ప్రాంతాల భక్తులు జగన్నాథుడిని దర్శించుకున్నారు.

పాలకొండ: పట్టణంలోని జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సుబద్ర, బలబద్ర సమేతుడైన జగన్నాథుడు సోదరుడు బలబద్రుడు కూర్మావతారంలో రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు గుండిచా మందిరానికి తరలివచ్చి స్వామివారిని దరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకులు మఠం విశ్వనాధదాసు పూజలు చేయగా ఈవో సర్వేశ్వరరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.



భామిని: డీటీకి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సాలూరు: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మునిసిపల్ కార్మికులు



గరుగుబిల్లి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా వ్యాప్తంగా అఖిల భారత కోర్కెల దినం పురస్కరించుకుని నిరసనలు

తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం అఖిల భారత కోర్కెల దినం పురస్కరించుకుని రెవెన్యూకార్యాలయాల వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు వివిధ సంఘాలనాయకులు నిరసన తెలిపారు. అనంతరం సమస్యపై అధికారులకు నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

గరుగుబిల్లి:అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కార్యదర్శి బీవీరమణ మాట్లాడుతూ42రోజుల సమ్మెకాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోని అంశాలపై వెంటనే జీవోలు ఇవ్వాలని, ఐసీడీ ఎస్ బలోపేతం చేయడంతో పాటు బడ్జెట్‌ను పెంచాలని కోరారు. అనం తరం వినతి పత్రాన్ని తహసీల్దార్ కె.జయకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ గౌరమ్మ, కృష్ణవేణి, సత్యవతి, హైమావతి, స్వాతి, ఆశా కార్యకర్తల ప్రతినిధి గంగాభవాని, పద్మ పాపాల్గొన్నారు.

● **సాలూరు:** కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, సీహెచ్‌డబ్ల్యూలు మునిసిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయంవరకు ర్యాలీ నిర్వహించి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ లేబర్‌కోడ్లు రద్దుచేయాలని,కార్మికులకు కనీస జీతం 26 వేలు రూపాయలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశికళ, నారాయణమ్మ, పుష్ప, రాముడు, శంకరరావు పాల్గొన్నారు.

●**పాలకొండ:** కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక హక్కులను కాలరాయడానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాలరమణారావు ఆరోపించారు. పాలకొండ తహసీల్దార్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ అధ్యక్షుడు బి.అమరవేణి, కార్యదర్శి కాదరాము, వివిధ సంఘాల నాయకులు హిమ ప్రభ, జెస్సీబాయి, గౌరీశ్వరి, మహేశ్వరి, ధనలక్ష్మిపాల్గొన్నారు.

●**భామిని:**ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, సునీత, పద్మ, కావ్య, మేరీతో పాటు పలువురు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాజశేఖరానికి వినతిపత్రం అందించారు.



బలిజిపేటలో నిరసన తెలుపుతున్న కార్మికులు, అంగన్‌వాడీలు



సీతానగరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



పాలకొండ: నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అభివృద్ధికి సహకరించండి

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ: అభివృద్ధికి అధికారులంతా తమవంతు సహకరించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం కొమరాడలో ఎంపీడీవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారయంత్రాం గమంతా ప్రభుత్వానికి సహకరించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చే బాధ్యత యంత్రాంగానికి ఉందని సూచించారు.అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చివేతకు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపించామని అధికారులు వివరించారు. పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు, నాయకులు డి.వెంకటనాయుడు, సుదర్శనరావు, పి.వెంకటనాయుడు, ఎస్.మధుసూదనరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

● డ్వామా పీడీ రామచంద్రరావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

పాచిపెంట:ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు అధికంగా చేసేందుకు ఏపీవోతో సహా సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో పాచి పెంట మండలం బాగా వెనుకబడి ఉందని తెలిపారు. మండలంలో 90 వేలు అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా, కేవలం 22 వేల పనులు చేశారని చెప్పారు. మండలంలోని 29 పంచాయతీలలో 15 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఖాళీగా ఉన్న ఐదు ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టుల ను ఈనెల 20లోగా భర్తీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 451 పంచాయతీ ల్లో పాచిపెంటమండలం బాగా వెనుకబడి ఉందని తెలిపారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో పి.లక్ష్మికాంత్, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.సత్యనారాయణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో మొబైల్ ఏటీఎం సేవలు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం గుమ్మ లక్ష్మీపురంలో శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంకు మొబైల్ ఏటీఎం ప్రారంభించింది. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో పలువురు సేవలు వినియోగించుకున్నారు. గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రానికి సంత రోజు వచ్చే బ్యాంకు ఖాతాదారులు ఈ ఏటీఎంలో సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు కోరారు.

అమర వీరులకు నివాళి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం రూరల్: శ్రీకాకుళ ఉద్యమంలో అసువులు బాసిన కామ్రేడ్‌వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వర్ధంతిని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కురుపాం మండలంలోని గుమ్మ గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అమరవీరులకు నివాళులర్పించారు.కార్యక్రమంలో గుమ్మమాజీ సర్పంచ్ వెంపటాపు భారతి, సీపీఐ ఎంఎల్ నాయకుడు భాస్కరరావు, తోటజీవన్, జి.సూరయ్య పాల్గొన్నారు.

పేదలపై దాడులను ఆపాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామంలో పేదలపై రెవెన్యూ సిబ్బంది దాడులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్‌చేశారు. బుధవారం తూరుమామిడిలో వ్యవసాయ కార్మికసంఘం సభ్యులతోకలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూరుమామిడి గ్రామంలో 1995, 2019లో పేదలు, చేతివృత్తిదారులకు సర్వే నెంబరు 71లో సబ్‌డివిజన్ చేయకుండా పట్టాలు మంజూరుచేశారనితెలిపారు.పట్టాలిచ్చిన స్థలాల్లోనే హైస్కూల్ నిర్మాణానికి సుమారు ఎకరా భూమిని కేటాయించారని చెప్పారు. పట్టాదారులు ఎక్కడ ఇళ్లు కట్టాలో తెలియక నచ్చిన దగ్గర కట్టుకున్నారని తెలిపారు.ఈనేపథ్యంలో చీపురు మహాలక్ష్మి, బొడ్డానగంగ, బొడ్డాన పైడమ్మ, బొడ్డాన లక్ష్మి, బొడ్డాన సింహాచలం, బొడ్డాన రాజేశ్వరిలు పూరిల్లు ఏర్పాటు చేయగాఈ, వాటిని రేకుల ఇంటిగా మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తే రెవెన్యూ అధికారులు వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పేదలపై తప్పుడు కేసులు ఆపాలని డిమాండ్ చేశారు. తూరుమామిడిలో సర్వే నెంబరు 71/4లో ఐదు సెంట్ల భూమిని రైతు భరోసా కేంద్రానికి కేటాయించినా, ఇంతవరకు కేంద్రాన్ని నిర్మించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, సీపీఎం మండల అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల సీతారాం, అల్లు ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏడు నియోజకవర్గాల్లో సహాయకేంద్రాలు

● విజయనగరం ఎంపీ కలిశెట్టి

పూసపాటిరేగ:ఏడు నియోజకవర్గాల్లో సహాయకేంద్రాలను ఏర్పాటుచేస్తామని, ఇవి 24 గంటలు ప్రజలకు సమస్యలు చెప్పుకొనేందుకు అందుబాటులో ఉంటాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం చల్లవానితోటలో టీడీపీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమిలో అందరూ కలిసి కష్టపడ్డారని, అందరికీ గుర్తింపు ఉంటుందని, కార్యకర్తగా మనోవేదన తెలుసునని తెలిపారు. ఇటువంటి విమర్శలు బాహాటంగా చేయరాదని నాయకులకు హితవు పలికారు. ఇటువంటి అంతర్గత సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారదిశగా ఆలోచించాలని, జనసేన కూటమిలో భాగమని మరిచిపోరాదని, ఆవేశాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, టీడీపీ నియోజవర్గ పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు, మాజీ మండలాధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండలాధ్యక్షులు మహంతి శంకరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, నాయకులు పతివాడ తమ్మినాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రేపు ఆలయాల హుండీలు లెక్కింపు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో గల వేంకటేశ్వర,శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం తోటపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయ ఈవో పర్యవేక్షణలో, గ్రామపెద్దల సమక్షంలో భక్తులు, సేవకుల సహకారంతో హుండీలుతెరిచి లెక్కించనున్నామని చెప్పారు.ఆసక్తి ఉన్న భక్తులు పంచె, కండువా ధరించి ఉదయం 8 గంటలకు ఆలయానికి హాజరుకావాలని కోరారు.ముందుగా దేవస్థానంకార్యాలయంలో పేర్లునమోదు చేసుకోవాలని కోరారు.

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

గరుగుబిల్లి:మండలంలో ఈనెల 14 వరకు పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించనున్నట్లు మండల పశు సంవర్థశాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాయితీపై పశుగ్రాస విత్తనాలను సరఫరా చేస్తామని తెలిపారు.

18 నుంచి పారిశుధ్య వారోత్సవాలు

భామిని: మండలంలో ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు పారిశుధ్య వారోత్సవాలు పురస్కరించుకుని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశవర్కర్లతో సమీక్షించాలని ఎంపీడీవో కె.కిశోర్‌కుమార్ తెలిపారు.మంగళవారం భామిని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.16 నుంచి 18వ తేదీ వరకు మండల స్థాయిలో సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

కళ్లికోటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కొమరాడ: కళ్లికోటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌విగ్రహాన్ని ఎమ్మెల్యే తోయకజగదీశ్వరి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు, పి.వెంకటనాయుడు, మధుసూదనరావు, డి.వెంకట నాయుడు కిషోర్ పాల్గొన్నారు.

గోతులు పూడ్చి వేత

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారిపై కొమరాడ, గుమడ గ్రామ సమీపంలో ఉన్న గోతులను బుధవారం పూడ్చారు. టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు తన సొంత ఖర్చులతోయంత్రాన్ని ర్పాటుచేసి గోతులు పూడ్చి పెట్టారు.

గుమ్మలక్ష్మీపురంలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం:గుమ్మలక్ష్మీపురం పంచాయతీ ఆధ్వర్యంలోని నిమ్స్ ఆసుపత్రి సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కడ్రక మల్లేష్, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

వీరఘట్టం: రెండున్నర ఎకరాలు దాటిన రైతులు ఇతరులకు పండించేందుకు ఇస్తే వారి సమ్మతితో భూమి పండించే కౌలు రైతులకు కౌలు రైతుల గుర్తింపుకార్డులు అందజేస్తామని డిప్యూటీ తహసీల్దార్ బి.కుమారస్వామి తెలిపారు. బుధవారం వీరఘట్టం పంచాయతీ కార్యాలయం ఆవరణలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులకోసం రైతులతో సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తింపునకు గ్రామసభలు

గరుగుబిల్లి:గ్రామాల్లో కౌలురైతులను గుర్తించేందుకు పంచాయతీల వారీగా గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఏవో ఆర్.విజయభారతి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో ఆమె విలేఖరులతో మాటాడుతూ గ్రామాల్లో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామసభలను నిర్వహిస్తారని, గుర్తింపు కార్డును తీసుకుంటే కౌలుదారులకు పంట నమోదు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారని చెప్పారు.

రావివలసలో అవగాహన సదస్సు

గరుగుబిల్లి మండలంలోని రావివలసలో బుధవారం కౌలు రైతులకు అవగాహన సదస్సును వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీష్, వీఆర్వో రెడ్డి వినాయకుడు, ఉప సర్పంచ్ గుంట్రెడ్డి పద్మావతి, టీడీపీ నాయకులు గొర్లి కిషోర్, గుంట్రెడ్డి వెంకటనాయుడు పాల్గొన్నారు.



వీరఘట్టం: మాట్లాడుతున్న డీటీ కుమారస్వామి



గరుగుబిల్లి:మాట్లాడుతున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీష్